క్లుప్తంగా

దివ్యాంగులను గుర్తించండి



మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: అంగవైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని యజమాన్యం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్థపై నిర్వహించిన ఒకరోజు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. 21 రకాల వైకల్యాలు ఉంటాయని వాటిపై అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థుల జాబితాను ఐఈఆర్‌పీకి సమర్పించాలన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ



పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

కౌటాల: పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ పెట్టాలని కౌటాల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో గాలికుంటు నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాల కార్యక్రమం చేపట్టిందన్నారు. నాలుగు నెలల వయస్సు నుంచి పైబడిన పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శోభన్, భిక్షపతి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీవారంలో మూడు సార్లు గుడ్లు వడ్డించాలని, మెనూ తప్పక పాటించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో చదివించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డిసెంబర్‌లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు న్యాస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఎం సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రమేశ్‌బాబు అన్నారు. కొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని జిల్లా పరీక్షల విభాగ అధికారి ఉదయ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు ఖాళీ సమయంలో పుస్తకాలు చదవాలని సూచించారు. పాఠశాల్లో విద్యార్థులకు సుమారు 800 పుస్తకాలతో పాటు సౌకర్యాలను సమకూర్చిన రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్‌కుమార్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ అశోక్‌చారి, కోఆర్డినేటర్ వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాలకు నిధుల కేటాయింపు

ఉట్నూర్‌రూరల్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ పరిధిలోని ప్రతీ దండారీకి రూ. 15 వేల చొప్పున కేటాయించడం జరిగిందని ఐటీడీఏ పీ వో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో ఐటీడీఏ పరి ధిలోని వేయి గ్రామాలలో ఒక్కొక్క దండారికి రూ. 15 వేల చొప్పున ప్రభుత్వం రూ. 1 కోటి 50 లక్షలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు.

భూ పంచాయితీలు..!

- పెరుగుతున్న కేసుల సంఖ్య
- పెరిగిన భూముల ధరలు
- పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతు కుటుంబం

కౌటాల: ప్రస్తుత సమాజంలో బంధాలు, బంధుత్వాలు లేవు. కన్నవారిపైనే మమకారం కనిపించడం లేదు. భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో డబ్బు కోసం కొట్టుకు చస్తున్నారు. జిల్లాలోని పోలీసు స్టేషన్లకు వచ్చి ఫిర్యాదుల్లో సగానికి పైగా భూమికి సంబంధించిన ఫిర్యాదులు ఉండడం గమనార్హం. పతీఏటా జిల్లాలో భూ సమస్యల కేసులు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో భూ తగదాలు హత్యకు దారి తీస్తున్నాయి. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో భూ వివాదాలు లేకుండా చూడాలని పలువురు పేర్కొంటున్నారు. కౌటాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన అన్నతమ్ముళ్లు ఇటీవల భూ తగదాలతో దాడులు చేసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పెద్దలు పంచాయితీ పెట్టి సమస్యను పరిష్కరించారు.

భూమికి డిమాండ్ పెరగడంతో..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో పాటు ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లాగా ఏర్పడిన అనంతరం భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒకప్పుడు రూ. లక్షలు పలికిన భూములు ఇప్పుడు రూ. కోట్లకు చేరిపోయాయి. రోడ్డు సైడ్ రూ. 10 నుంచి రూ. 20 లక్షల వరకు ఉన్న భూముల ధరలు ఇప్పుడు పదింతలు పెరిగాయి. కాగజ్‌నగర్ ప్రధాన రహదారి సమీపంలోని భూములకు రూ. కోట్లలో ధర పలుకుతోంది. ఆసిఫాబాద్ పట్టణానికి సమీపంలోని నాలుగు వరుసల రహదారి సమీపంలోని భూములకు సైతం ప్రస్తుతం ధర కోట్లలో పలుకుతోంది. ఇక మండల కేంద్రాల్లో సైతం ఎకరానికి రూ. 30 లక్షలకు పైనే ధరలున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల కంటే కౌటాలలో భూములకు ధరలు విపరీతంగా పెరిగాయి.

నిత్యం పంచాయితీలు..

జిల్లాలో పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన కేసులను పరిశీలిస్తే సగానికి పైగా భూమికి సంబంధించిన కేసులే ఉంటున్నాయి. చాలా వరకు పోలీసులు భూమి సమస్యలతో వచ్చి న వారిని సముదాయించి పంపిస్తున్నారు. కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల పదికి పైగా భూ వివాదాల కేసులు నమోదయ్యాయి. రెవె న్యూ రికార్డుల నిర్వహణలో జరిగిన లోపం భూమి పంచాయితీలు పెరగడానికి మరో కారణమైంది. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాక ముందు ఆఫ్‌లైన్‌లో భూ ముల రికార్డులు తారుమారయ్యాయనే ఆరో పణాలున్నాయి. భూ పంపకాల్లో, గెట్టు పంచాయితీలు, భూ కబ్జాల పేరిట పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రజలు నిత్యం తిరుగుతున్నాయి.

భూమి ఫిర్యాదులే ఎక్కువ



పోలీస్‌స్టేషన్లకు భార్య భర్తల సమస్యల కేసులతో పాటు భూ పంచాయితీ ఫిర్యాదులే ఎక్కువ వస్తున్నాయి. పెరిగిన భూముల ధరలు, రెవెన్యూ రికార్డుల నిర్వహణలో లోపాలు, భూమి పంపిణీల్లో లోపాలు కారణంగా తెలుస్తోంది. సివిల్ కేసులను రెవెన్యూ అధికారులకు.. క్రిమినల్ కేసులంటే చట్టపరంగా నమోదు చేస్తున్నాం. గొడవలతో సమస్యలు పరిష్కారం కావు.

– ఎస్. మధుకర్, ఎస్సై, కౌటాల

సమస్యలకు సత్వర పరిష్కారం



వినతిపత్రం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

- కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. 39 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా సిర్పూర్ పేపర్ మిల్లులో పేపర్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఎస్పీఎం కార్మికులు, ఉద్యోగులు వినతిపత్రం అందించారు. అంతకు ముందు వారు ఎస్పీఎం గేటు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈఎస్ఐ ఆస్పత్రి డిస్పెన్సరీకి చెందిన మందులు ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ మందుల దుకాణంలో విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు వినతిపత్రం అందించారు.

వంతెన నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టరేట్ వద్ద కొత్త దుబ్బగూడ గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని కొత్త దుబ్బగూడ గ్రామానికి రోడ్డు, వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సోమవారం గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి ఇబ్బంది పడుతున్నామన్నారు. వర్షాకాలంలో రోడ్డంతా చిత్తడిగా మారి వాహనాలు నడవలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో పటేల్ నగోసే సోమ, దత్తు, గుర్నులె తులసిరాం, సెండె సాగర్, బిక్కు, నగోసె కేశవ్‌రావ్, నారాయణ పాల్గొన్నారు.

సింగరేణిలో అవినీతికి చోటులేదు



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థలో అవినీతి చోటులేదని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. సంస్థలో అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామని కార్యాలయ ఉద్యోగులు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏ రంగంలో అవినీతి ఉంటుందో.. ఆ రంగం అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. దాని ప్రభావం దేశ పురోభివృద్ధిపైనా పడుతుందన్నారు. సింగరేణి సంస్థలో అవినీతిని సమూలంగా రూపుమాపేందుకు ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించకుండా వెంటనే విజిలెన్స్ విభాగానికి సమాచారం అందించాలని ఉద్యోగులకు సూచించారు. సంస్థను అవినీతి రహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జుపాక రాజేశ్, ఎస్‌వోటూజీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'పద్మశ్రీ' కనకరాజుకు నివాళి



నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్ నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో సోమవారం గుస్సాడీ కళాకా రుడు పద్మశ్రీ కనక రాజుకు ఘన నివాళులర్పించా రు. కనకరాజు చిత్రపటానికి పూలమాల వేసి మౌ నం పాటించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గుస్సాడీ నృత్యానికి గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు పొందిన కనకరాజు జిల్లాకు చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. వారి మరణం తీరని లోటని, వారి ఆత్మకు శాంతి కలుగాలని కోరారు. నాయకులు నారాయణ, రమణయ్య, రామయ్య, కోటేశ్వర్‌రావు, పు రుషోత్తం, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న బాలాజీ

కెరమెరి: పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్ రూ. 10 వేలు ప్రకటించాలని మాలీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి లెండ్గురే బాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇప్పటికే పంటలో దిగిబడి లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతుంటే మార్కెట్లో క్వింటాల్‌కు రూ. 6500 ధరతో కొనుగోలు చేయడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 7521 ఉండగా.. తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు ఆర్థకంగా నష్టపోతున్నారని అన్నారు. పట్టాపాస్ పుస్తకాలు లేని రైతుల పండించిన పత్తి పంటను సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను నమ్మి నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వాడై సుభాశ్, పరమేశ్వర్, నాందేవ్, నికోడే శ్రావణ్, సెండే మహేశ్, రాజు పాల్గొన్నారు.

'కళాశాలపై చర్యలు తీసుకోవాలి'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్, డిగ్రీ కళాశాలను ఒకే ప్రాంగణంలో రెండు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కలిపి సబ్జెక్టుకు ఒకే లెక్చరర్‌ను నియమించి విద్య బోధన చేస్తున్నారని ఆరోపించారు. ల్యాబ్‌లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిఖిల్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత



సన్మానిస్తున్న మెస్రం మనోహర్

జైనూర్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన న్యానేశ్వర్-లక్ష్మి దంపతుల కుమార్తె సాయిశ్రద్ధ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఎంతో గర్వ కారణమని ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సాయిశ్రద్ధను సన్మానించి రూ. 61 వేలు ఆర్థికసాయం చేశా రు. కార్యక్రమంలో జిల్లా సార్మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, మెస్రం బాదు, మడావి ఆనంద్‌రావు, ప్రధాన్ సమాజ్ ఉద్యోగులు గోవింద్‌రావు, శ్రీనివాస్, మెస్రం శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని బాబర్ గొంది, కుతోడ గ్రామాల్లో ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో మంజూరైన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల సౌకర్యం కోసం రూ.60 లక్షలతో భవనాలు నిర్మాణం చేస్తున్నామని, గిరిజన ఆదివాసీ యువత ఉన్నత చదువులు చదివి మంచి ప్రయోజకులు కావాలని కోరారు. ప్రపంచం అభివృద్ధిలో దూసుకుపోతుంటే ఆదివాసీలు ఇంకా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీల కల్పన కోసం విడుదలవుతున్న నిధులు సక్రమంగా వారికి వినియోగించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఐటీడీఏ డీఈ నిజాముద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని ఎంఈవో భవనం



లింగాపూర్‌లో నిర్మించిన విద్యావనరుల భవనం

లింగాపూర్: మండలంలోని 2018లో నిర్మించిన విద్యావనరుల భవనం నేటికి ప్రారంభించకపోవడంతో ఉపాధ్యాయులకు నిర్వహించే సమావేశాలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఈ భవనాన్ని 2018లో రూ. 30 లక్ష్యల వ్యయంతో నిర్మించినా.. నేటికి ఇలాగే ఉంది. భవనంలో కొన్ని రోజులు కస్తూరిబా వసతి గృహం ఏర్పాటు చేశారు. ఇప్పుడు అంగన్‌వాడీ భవనాన్ని నడిపిస్తున్నా.. ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడం లేదు. లింగాపూర్ మండలంలో రెగ్యులర్ ఎంఈవోను నియమించి న్నా.. పక్కా భవనం మాత్రం ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

'అభివృద్ధికి దూరంగా కొలాం గిరిజనులు'



సూరు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

జైనూర్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా కొలాం గిరిజనులు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని కొలాం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలేరావు, ఉపాధ్యక్షుడు టీకం వసంత్‌రావు, ఐటీడీఏ పాలక మండలి మాజీ డైరెక్టర్ ఆత్రం భీంరావు అన్నారు. మండలంలోని జంగాం గ్రామంలో సోమవారం కుమురం సూరు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్‌పై సర్వాధికారాలు దక్కాలని నిజాంకు వ్యతిరేకంగా కుమురంభీంతో కలిసి పోరాడి వీరమరణం పొందారని పేర్కొన్నారు. కొలాం గ్రామాలకు నేటికీ అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆత్రం రాజు, ఉపాధ్యక్షుడు ఆత్రం బారిక్‌రావు, నాయకులు ఆత్రం శంకర్, నగేశ్, ఆత్రం ఆనంద్‌రావు, సిడాం రాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు నెలకొల్పేందుకు కృషి



అవగాహన కల్పిస్తున్న నరేందర్ రెడ్డి

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను నెలకొల్పేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా టీచర్లు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రూపొందించడంలో కీలకపాత్ర పోషించే శాసనమండలికి పోటీ చేస్తున్నానని, రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుత వ్యవస్థలో మార్పు కోసమే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని అన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలతో పాటు నిరుద్యోగ నిర్మూలనకు స్కిల్ నైపుణ్య కేంద్రాలు ప్రారంభించడంతో పాటు యువతకు నిరుద్యోగ భృతి అందించే విధంగా శయశక్తులా కృషి చేస్తానన్నారు. సమావేశంలో పలు కళాశాలల కరస్పాండెంట్లు హనోక్‌కుమార్, రాజమౌళి, ట్రస్మా రాష్ట్ర సభ్యులు రాజేంద్రఫణి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

లింగాపూర్: మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం కస్తూరిబా పాఠశాలలో పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందన్నారు. మహిళలను వేధించడం, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం, బాల్యవివాహాల, వరకట్నం చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారుల్కు గురైతే రు. షీటీం సిబ్బంది స్వప్న, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.